క్లుప్తంగా

పంటల నమోదు పక్కాగా జరగాలి

● వ్యవసాయ శాఖాధికారి రమేష్



వీఏఏలతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి రమేష్

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల రైతులు పంటలను ఈ క్రాప్‌లో పక్కాగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖాధికారి రమేష్ కోరారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీఏఏలతో ఆయన మాట్లాడారు. పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకుంటే పంట నష్టం జరిగిన సమయంలో పరిహారం పొందవచ్చని తెలిపారు. పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు అమ్ముకోవడానికి వీలుంటుందన్నారు. ప్రతి వీఏఏ వారికి ఇచ్చిన టాస్కులు ఇన్‌టైమ్‌లో పూర్తి చేసుకోవాలన్నారు. వీఏఏలు వారి సమస్యలను వివరించగా పరిష్కారాలు సూచించారు. మండలంలో ప్రస్తుతం శనగ పంట వేస్తున్నారని, పంట వేసిన ప్రతి పొలాన్ని ఈ క్రాప్‌లో నమోదు చేయాలని అన్నారు. వీఏఏలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వీఏఏలతో పాటు ఏఈఓ శేషయ్య పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాల సమర్పణ

ఒంగోలు మెట్రో: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలుకు చెందిన సాయి కుమార్ అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన సాయి కుమార్ ను కుటుంబ సభ్యులను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న అధికారులు

ఒంగోలు సబర్బన్: స్థానిక వాణిజ్య పన్నుల కార్యాలయం–1లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ డి.ఝాన్సీ ఆధ్వర్యంలో పైనం మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జె.ఏడుకొండలు, డీసీటీఓలు గుది శ్రీనివాసరావు, ఎన్వీ సుబ్బారావు, కె.సుధాకరరావు పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా జడ తిమోతి, పాస్టర్ పాల్గొని క్రిస్మస్ సందేశం అందించారు. ఈ సందర్భంగా బొమ్మరిల్లు ఆశ్రమం ఆడపిల్లలకు కేంద్రియ విద్యాలయ యూనిఫాం అందజేశారు. దారా సుధాకరరావు, పి.అంజయ్య, ఎ.పెద్దమ్మాయి, తిమోతి, సునీత సౌజన్య, వంశీ, కొండలరావు, ఎఫ్ఎం ఇంజినీర్ కె.వి. సుబ్బారావు ప్రేమవిందులో పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి శోభ

● ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు



విద్యుత్ దీపాల అలంకరణలో శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం



తిరుప్పావై ప్రవచకులు నెమ్మాని సీతారామమ్మూర్తి

ఒంగోలు మెట్రో: జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏరాట్లు పూర్తయ్యాయి. స్వాముల మూలవిరాట్ దర్శనానికి మార్గం సుగమం అయింది. ధనుర్మాసం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ప్రముఖ ప్రవచకులచే గోదాదేవి అమ్మవారి పాశురాలు కూడా నిర్వహిస్తున్నారు. ఒంగోలు కొండ మీద ప్రధాన దేవాలయం శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం, స్థానిక కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, దక్షిణం బజారు లోని కోదండరామ స్వామి దేవాలయం, గోశాలలోని శ్రీకృష్ణ మందిరం, పోలీస్ క్వార్టర్స్ సీతారామచంద్ర స్వామి దేవస్థానంతో పాటు ఎన్నో ఆలయాలను ఆయా దేవస్థానం పాలకవర్గాలు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణతో తీర్చిదిద్దాయి.

పాశురమే ప్రభాతం

సంప్రదాయబద్ధంగా అనుసరించే మాసాల్లో ధనుర్మాసం ఒకటి, దైవాన్ని అర్పించుకునే అనువైన మాసంగా ధనుర్మాసానికి పేరు ఉంది. ధనుర్మాసం 30 రోజులపాటు ఆండాళ్ తల్లి తిరుప్పావై వ్రతాన్ని ఆచరించి తన అనుకున్న కోరికను సాధించుకుంది. తిరుప్పావైని వెంకటేశ్వర స్వామికి పరమ భక్తురాలుగా ప్రసిద్ధి పొందిన గోదాదేవి రచించింది. ఈ తల్లి పన్నెండు ఆళ్వారులో ఏకైక ఆళ్వార్ భగవంతుని వశం చేసుకున్న పరమ భక్తురాలైన స్త్రీ. కాత్యాయిని వ్రత చరణ వలన కన్యలకు మంచి వరుడు లభిస్తాడన్నది భక్తుల విశ్వాసం. గోదామాత స్వయంగా ఈ పాశురాలను చెప్పి తన తోటి గోపికలతో కలిసి ఈ వ్రతాన్ని ఆచరించిందని ప్రముఖ ప్రవచకులు నెమ్మాని సీతారామమూర్తి తెలిపారు. ముక్కోటి ఏకాదశి పండగ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని అనంత కోదండ రామస్వామి మందిరం వంశపార్య ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ తెలిపారు. రామ మందిరంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించినట్లు సుబ్బయ్య శర్మ తెలిపారు.

విష్ణు వైభవం ముక్కోటి ఏకాదశి

వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం చేస్తే మోక్షం లభిస్తుందని ముక్కోటి దేవతల ఆశీస్సులు లభిస్తాయని ప్రముఖ ప్రవచకులు పొన్నూరు శ్రీనివాసులు తెలిపారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం సమయాన ఉత్తరాభి ముఖులమై స్వామిని సేవిద్దామని, కార్యసిద్ధిని సాధిద్దామని, జ్ఞానాన్ని పొందుదామని పొన్నూరు శ్రీనివాసులు తెలిపారు.

కోవిడ్ ఎదుర్కొనేందుకు అంతా సిద్ధం



జీజీహెచ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పక్కన ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు

ఒంగోలు టౌన్: కోవిడ్ జే 1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ బి.తిరుమలరావు చెప్పారు. శుక్రవారం రిమ్స్ వైద్యశాలలో కోవిడ్ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో పలువురు వైద్య సిబ్బంది, ఇతరులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలను నిర్వహించారు. అలాగే సిబ్బందితో కలిసి ఇండో అమెరికన్ షెడ్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఆర్ఎంఓ మాట్లాడుతూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాలతో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ సూచనలు, సలహాలతో కోవిడ్‌పై అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జీజీహెచ్‌లో గత కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన ఇండో అమెరికన్ షెడ్డులను సిద్ధం చేసినట్లు చెప్పారు. అందులో ఉన్న 100 ప్రత్యేక పడకలతో పాటు అదనంగా మరో 50 పడకలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 1000 ఆక్సిజన్ సిలిండర్లు, 3 ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశామని, ఇప్పటికే మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. జీజీహెచ్‌లో ఆర్టీపీసీఆర్ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో ర్యాపిడ్ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేరళలో కోవిడ్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నందున శబరిమల వెళ్లి వచ్చిన భక్తులు ముందు జాగ్రత చర్యగా కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రతలు తీసుకోవాలని, అవసరమైతేనే తప్ప అనవసరంగా బయటకు రాకపోవడమే మేలన్నారు. ఎంతో అవసరమైతేనే ప్రయాణాలు చేయాలన్నారు. మార్కెట్‌కు వెళ్లినప్పుడు, జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్ల వలసివచ్చినప్పుడు సామాజిక దూరం పాటించాలని, తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సూచించారు. చిన్న పిల్లల విషయంలో తలిదండ్రులు జాగ్రతలు తీసుకోవాలని, అవసరమైతేనే బయటకు పంపించాలని చెప్పారు. స్కూలులో పిల్లలు గుంపులుగా తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, గొంతునొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యున్ని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. గతంలో కోవిడ్‌తో బాధపడిన వారిపై ఈ వైరస్ ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. అయితే ఇప్పటికి వస్తున్న సమాచారం ప్రకారం ఎక్కువగా ప్రమాదకారి కాదని, అయితే ఎక్కువ వేగంగా విస్తరిస్తుందని వివరించారు.

పార్లమెంట్‌పై దాడిని అడ్డుకోలేరా?



అద్దంకి బస్టాండు సెంటర్లో నిరసన ప్రదర్శన చేస్తున్న వివిధ రాజకీయ పార్టీలు

ఒంగోలు టౌన్: పార్లమెంట్‌పై జరిగిన దాడిని పసిగట్టలేని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని వివిధ రాజకీయ పార్టీలు పిలుపునిచ్చాయి. పార్లమెంటు సమావేశాల నుంచి 146 మంది ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను బహిష్కరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం అద్దంకి బస్టాండు సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రసంగిస్తూ.. మోదీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే పార్లమెంటుపై దాడి జరిగిందని విమర్శించారు. దాడికి సమాధానం చెప్పాల్సిన ప్రధాన మంత్రి దానికి విరుద్ధంగా ఇండియా కూటమి ఎంపీలను బహిష్కరించడం అసమర్థతకు నిదర్శనమన్నారు. దొడ్డిదారిన కార్పొరేట్ అనుకూలంగా బిల్లులను పాస్ చేసుకునేందుకే ఎంపీల బహిష్కరణ నాటకాలకు తెరదీసిందన్నారు. కేంద్రంలోని నియంతృత్వ బీజేపీని ఓడించేందుకు దేశంలోని 28 పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని, రానున్న ఎన్నికల్లో మోదీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీపతి ప్రకాశ్ చెప్పారు. మైసూర్‌కు చెందిన బీజేపీ ఎంపీ ఇచ్చిన పాస్‌తోనే ఆగంతకులు పార్లమెంటులోకి ప్రవేశించారని, పార్లమెంటు దాడి వెనుక దాగివున్న బీజేపీ రాజకీయ కుట్రలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సాక్షిగా మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని సీపీఎం జిల్లా కారదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. ఆర్. వెంకటరావు, పీవీఆర్ చౌదరి, బాలకోటయ్య, చీకటి శ్రీనివాసరావు, ఎంఏ సాలార్, దాసరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెమీక్రిస్మస్



కరవదిలో నూతన వస్త్రాలు దివ్యాంగులకు అందిస్తున్న దృశ్యం

ఒంగోలు రూరల్: రైల్వే సీనియర్ ఉద్యోగి అంచిపోగు శ్రీనిసరావు ఆధ్వర్యంలో కరవది అంబేడ్కర్ నగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నింగ్ బాడీ బైబిల్‌మిషన్ మెంబర్ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ ఆర్ఎంపీ ప్రభాకర్ కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. వికలాంగులు 30 మందికి నూతన వస్త్రాలు బహూకరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పూర్వ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు నిర్వహించారు. గత ఐదేళ్లుగా అంచిపోగు శ్రీనివాసరావు పేదలను గుర్తించి ఈ విధంగా చేయడం సంతోషకరమన్నారు.

విశ్వకర్మ యోజనలో నమోదు చేసుకోండి



పథకంలో నమోదు చేయిస్తున్న ధనిశెట్టి పావని

ఒంగోలు సెంట్రల్: ప్రధాని విశ్వకర్మ యోజన పథకంలో పేరు నమోదు చేసుకుని లబ్ధి పొందాలని భారతీయ జనతా పార్టీ ఒంగోలు నగర మోర్చా అధ్యక్షురాలు ధనిశెట్టి పావని కోరారు. పట్టణంలో శుక్రవారం అర్హత కలిగిన పలువురికి పథకం ప్రయోజనాలను వివరించి నమోదు చేయించారు. జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి



పేస్ కాలేజీలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుక

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ ప్రతిభను గురించి వివరించారు. అనంతరం గణిత అధ్యాపక బృందం ఆయన పరిశోధనలను కొనియాడారు.

మాంటిస్సోరీలో..

స్థానిక మాంటిస్సోరీ స్కూలులో జరిగిన శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలతోపాటు ఆయన చిన్న వయస్సులోనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచారన్నారు. ఆయన మరణం భారతీయ గణిత శాస్త్ర పరిశోధకులకు తీరని లోటుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు చిన్నారులకు గణిత క్విజ్, సెమినార్స్, మాథ్స్ రాపిడ్ ఫైర్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కరస్పాండెంట్ శబరీనాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌బాబు, గణిత ఉపాధ్యాయులు చిరంజీవి, రమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: జాతీయ గణిత దినోత్సవాన్ని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణితంపై అనేక పరిశోధనలు చేసి 3 వేల సూత్రాలు కనుగొన్న శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ డిసెంబర్ 22న గణిత దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. సూత్రాలన ఆధారం చేసుకుని అనేక మంది మేధావులయ్యారని చెప్పారు. గణితంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, వర్కింగ్ మోడల్స్, చార్ట్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, మధు, గణిత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, అన్నపూర్ణ, చంద్రశేఖర్,సీహెచ్ కోటేశ్వరరావు, పత్రే వెంకట్రావు, ధనలక్ష్మి, నాగమల్లేశ్వరి, శరత్ చంద్ర, కృష్ణమూర్తి, జిలాని, శేషగిరి, కృష్ణయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణ సీవో అండ్ ఒలింపియాడ్‌లో..

ఒంగోలు: స్థానిక లాయరుపేటలోని నారాయణ సీవో అండ్ ఒలింపియాడ్ స్కూల్‌లో శుక్రవారం గణిత దినోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రిన్సిపాల్ సయ్యద్ నాగూర్‌వలి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో, నిత్య జీవితంలో గణితం ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. 2012 నవంబరు 22వ తేదీ జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవాలని గణితం ప్రాధాన్యతను తెలియజేస్తూ నాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రకటించారన్నారు. వ్యకృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ఏజీఎం పెద్దిరెడ్డి, ఆర్ఐవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాంటిస్సోరీ ఉన్నత పాఠశాలలో..



కొత్తపట్నం హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు



నారాయణ స్కూల్లో బహుమతులు అందుకున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ అభయ గణపతిస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 20వ తేదీ నుంచి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠతో ముగిసింది. కార్యక్రమంలో మున్నంగి వెంకట్రావు, కొంజేటి సురేష్ బాబు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

చిలకపాడులో ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం చిలకపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని విద్యాప్రమాణాలను మెరుగుపరచుకోవాలని వారు ఆకాంక్షించారు. హైస్కూలు టీచర్లు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభ దృశ్యం

ఒంగోలు రూరల్: కొప్పోలు గ్రామంలో రైతు సాధికారిక సంస్థ ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సంస్థ సంయుక్తంగా ప్రకృతి వనరుల కేంద్రాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు పాల్గొని ఈ వ్యవసాయం ద్వారా మానవ ఆరోగ్య పరంగా కలిగే లాభాలను, రసాయనిక ఎరువులు వాడడం వలన మానవుల శరీరంలో కలిగే తీవ్ర నష్టాలను భూమి నిస్సారమైపోతున్న వైనాన్ని స్పష్టంగా వివరించారు. పురుగులు నివారణకు, నివారించేందుకు కసాయాల తయారీ పంట ఎదుగుదలకు కావాల్సిన ద్రావణాల తయారీ పసుపు రంగు జిగురు అట్టలు లింగా కర్షక బుట్టల తయారీ, బుట్టల ఏర్పాటు రైతులకు ఏయే సందర్భాల్లో ఉపయోగించాలో తెలియజేశారు. రైతు సోదరులంతా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మానవజాతికి ఆరోగ్యకరమైన పంట ఫలసాయాన్ని అందించాల్సిందిగా ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి వాకా మాధవి తెలియజేశారు. ఈ సంవత్సరం శనగ వేసిన, వేస్తున్న రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తే తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా మంచి ధరతో కొనుగోలు చేస్తామని ఆమె తెలిపారు. రసాయనిక ఎరువులు వాడి భూమి నిస్సారంగా మార్చవద్దని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని హితవు పలికారు. వాకా మాధవితో పాటు ఐసీఆర్‌పీలు సుభాషిణి, అమరవాణి, రజియా, రైతులు, మహిళా రైతులు డ్వాక్రా సంఘ మహిళలు, లీడర్లు పాల్గొన్నారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్రా



కార్యక్రమం గురించి వివరిస్తున్న పీడీలు

చీమకుర్తి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే రాఘవేంద్ర, ఈఓఆర్‌డీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పీడీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమక్షంలో ఈ పోటీలు నిర్వహించాలని తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని హైస్కూళ్ల పీడీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రకు 225 టీంలు

కొత్తపట్నం: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయటమే కాక ఆటల్లో నైపుణ్యాన్ని వెలుగుతీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా పెట్టిందని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణులు ఆటల్లో ఎంతో ఉత్సహంగా ఉంటారని తెలిపారు. ఈ నెల 26న అన్ని సచివాలయాల పరిధిలో ఆటలు జరుగుతాయన్నారు. ఇప్పటికే సచివాలయం సమీపంలో గ్రౌండ్‌ను శుభ్రం చేసుకుని సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. 225 టీంలు ఆన్‌లైన్ చేసుకున్నారని తెలిపారు. ఆటలు ఆడేందుకు ప్రభుత్వం బ్యాట్లు, గ్లౌజులు, బాల్స్ ఆట సామగ్రి సచివాలయ సిబ్బంది పంపిణీ చేశామన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాట్‌మెంటన్, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 2 కే, 3 కే రన్‌లు, యోగా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. మండల స్థాయిలో గెలిపొందిన ఆటగాళ్లను నియోజకవర్గ స్థాయికి, నియోజిక స్థాయిలో గెలిపొందిన వారు జిల్లాకు, అక్కడ నుంచి రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలిపొందిన ఆటగాళ్లకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేస్తారని చెప్పారు.

రెండు ప్రశ్నలకు ఒకటే సమాధానం



ప్రశ్న శతకము గ్రంథావిష్కరణ చేస్తున్న శ్రీనివాసులు, తదితరులు

చీమకుర్తి: రెండు ప్రశ్నలకు ఒకటే సమాధానం వచ్చేటువంటి ప్రశ్నలతో రూపొందించిన 'నాగేశ్వర ప్రశ్న శతకం'ను ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరి వెంకట శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. శుక్రవారం పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య హైస్కూలులో గొర్రెపాటి నాగేశ్వరరావు రచించిన ప్రశ్న శతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ ఒకే సమాధానం వచ్చేటువంటి రెండు ప్రశ్నలతో కూడిన శతకం రావడం ఇదే మొదటిసారని తెలిపారు. రచయిత సాహిత్యాన్ని కొనియాడారు. సాహితీ సేవారత్న కేవీ శాంతలక్ష్మి, రిటైర్డ్ జడ్జి వీ నాగేశ్వరరావు, హైస్కూలు కరస్పాండెంట్ బొడ్డు కోట్లింగం, హెచ్ఎం వై.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రచయిత నాగేశ్వరరావు గురించి ప్రశంసించి అభినందించారు.